RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 430 | 23 గురువారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

## : ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు



వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.



### రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చేపట్టిన

## ధర్నాలన్నీ డ్రామాలే

### : బండి సంజయ్

నీట్ వివాదం, ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆందోళన డ్రామాలకు తెరదీసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం అది బీజేపీకే లాభమని, ఆయన తమ పార్టీకి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేశారు. ప్రధాని నివాసం వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని, నీట్ అంశంపై కేంద్రం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉందని తెలిపారు. అలాగే, రాహుల్ కాబోయే ప్రధాని అని రేవంత్ రెడ్డి అనడం పెద్ద జోక్ అని కొట్టిపారేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, తెలంగాణలో రేవంత్ రెడ్డి చేపట్టిన ధర్నాలన్నీ కేవలం రాజకీయ నాటకాలేనని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను ప్రజలు ప్రతిపక్షంగా కూడా చూడటం లేదని, సీజేపీతో పోటీ పడేందుకే ఈ తరహా నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు, తెలంగాణలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతుంటే, ఎరువులు అందక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలు మాని వెంటనే రైతులకు నీరందించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్



కరీంనగర్‌లోని కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కార్యాలయం ఎదుటే బైఠాయించి కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. ఢిల్లీలో ప్రధాని మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళనను నిరసిస్తూ బీజేపీ గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా కాంగ్రెస్ నేతలు బండి సంజయ్ ఆఫీస్ వైపు రావడం ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు రెండు చోట్లా భారీగా మోహరించారు. మరోవైపు గాంధీభవన్ ముట్టడికి యత్నించిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుల సందర్భంగా బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ కార్యకర్తలు నిరసనకు దిగారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ఒకే రోజు జరిగిన ఈ పోటాపోటీ ఆందోళనలు, అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వేడిని రాజేశాయి.

## సెల్ఫీల మోజులో ప్రాణాలపైకి తెచ్చుకోవద్దు

### : అమెరికా నుంచి సీతక్క విన్నపం



తెలంగాణలోని ములుగు జిల్లా ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆమె, అక్కడి నుంచే పర్యాటకుల భద్రతను ఉద్దేశించి ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దట్టమైన అడవులు, గోదావరి జలాలు, బొగత జలపాతం, రామప్ప దేవాలయం, మేడారం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి అందాలకు ములుగు కేరాఫ్ అడ్రస్ అని ఆమె పేర్కొన్నారు. పర్యాటకులు ఇక్కడికి వచ్చి సంతోషకరమైన జ్ఞాపకాలతో సురక్షితంగా తిరిగి వెళ్లాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. అయితే, ఇటీవల కొందరు యువకులు ఉత్సాహంతో నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోవడం పట్ల మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ, పోలీసు శాఖలు ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటవద్దని ఆమె హెచ్చరించారు. ప్రమాదకరమైన జలపాతాలు, వేగంగా ప్రవహించే వాగులు, కొండచరియల వద్ద కేవలం సెల్ఫీలు, వీడియోల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. పర్యాటకులు అధికారుల సూచనలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే పర్యటన సురక్షితంగా, ఆనందంగా ఉంటుందని సీతక్క గుర్తుచేశారు.

## తెలంగాణ రైతులకు కేంద్రం గుడ్ న్యూస్

### : అదనపు ధాన్యం కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్



తెలంగాణ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో అదనపు పరిమాణంలో వరి ధాన్యాన్ని సేకరించేందుకు కేంద్రం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా మరో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం, మొత్తం సేకరణ పరిమితిని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

ధాన్యం కొనుగోలు కోటాను పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా, ధాన్యం నిల్వ, రవాణా పరంగా ఎదురయ్యే సవాళ్లు కూడా తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. వరి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ కీలక రాష్ట్రాల్లో ఒకటిగా ఉంది. కేంద్రం నుంచి ఇలాంటి సానుకూల నిర్ణయం వెలువడటం వల్ల మార్కెట్లు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా రైతులు ఆందోళనతో తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి తలెత్తదు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు మేలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. అదనపు ధాన్యం సేకరణ ప్రక్రియ, గడువు తదితర అంశాలపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

### 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు..

# ఒక్కరికీ శిక్ష లేదు

### : రాహుల్

నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో 152 ప్రశ్నపత్రాల లీక్‌లు జరిగాయని, దీంతో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రాహుల్, ప్రశ్నపత్రాల లీక్‌లపై నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనన్నారు. వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని విమర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి



తొలగించాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి, కుటుంబాలు రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా వారి భవిష్యత్తు దెబ్బతింటోందని రాహుల్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోతుండగా, ప్రత్యేక అవకాశాలు ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు.

## గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన



స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# గీసుకొండలో హరిత విప్లవానికి శ్రీకారం..

## – రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం
## – ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వంద మొక్కల నాటడం
## – పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యాభివృద్ధికీ రోటరీ క్లబ్ సేవలు

గీసుకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి, భావితరాలకు పచ్చని ప్రకృతిని అందించాలనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ ఆధ్వర్యంలో గీసుకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నమ్రత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు వంద మొక్కలను నాటి హరితహారానికి నాంది పలికారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు అనంతుల కుమారస్వామి మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. నేడు నాటిన ప్రతి మొక్క భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం, సమతుల్య పర్యావరణాన్ని అందించే అమూల్యమైన ఆస్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ విద్య, పర్యావరణం, సామాజిక సేవ రంగాల్లో నిరంతరం సేవలందిస్తోందని ఆయన తెలిపారు. స్థానిక సామాజిక సేవకుడు పెగళ్లపాటి లక్ష్మీనారాయణ సూచన మేరకు గతంలో ఇదే పాఠశాలకు సుమారు రూ.2 లక్షల విలువైన డెస్క్‌బెంచీలను అందజేసినట్లు గుర్తు చేశారు. అలాగే లక్ష్మీనారాయణ స్వంత నిధులతో అభివృద్ధి చేసిన విశాలమైన క్రీడా మైదానంలో వన మహోత్సవం నిర్వహించడం ఆనందదాయకమన్నారు. గ్రామ ప్రజల సహకారంతో భవిష్యత్తులో విద్య, పర్యావరణ పరిరక్షణ, సామాజికాభివృద్ధి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రోగ్రాం కన్వీనర్ మామిడాల రమేష్‌బాబు, కో-కన్వీనర్ జల్లిపల్లి మురళీధరాచారి, సీనియర్ సభ్యులు ఎల్లంకి రాజయ్య, మామిడాల సుధాకర్, తోట వెంకట



నాగరాజు, పుస్కూరి ధర్మేంద్ర, గ్రామ ఉపసర్పంచ్ కోట ప్రమోద్, స్థానికులు కర్ణకంటి రాంమూర్తి, రామా కుమారస్వామి, బండారి నరేందర్, ఉభయ పాఠశాలల ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొమ్మాలలో ఘనంగా బీరన్న బోనాలు

## – కొమ్మాలతో పాటు అనంతారం, విశ్వనాథపురం గ్రామాల భక్తులతో ఆధ్యాత్మిక శోభ

గీసుకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ బీరన్న బోనాల మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. కొమ్మాలతో పాటు అనంతారం, విశ్వనాథపురం గ్రామాలకు చెందిన కురుమ, గొల్ల సామాజిక వర్గాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా శిరస్సుపై బోనాలను మోసుకుంటూ మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి, శ్రీ బీరన్న స్వామివారికి బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, జైజై ధ్వానాలు, దైవనామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తిరసంతో మార్మోగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కన్నెబోయిన యమున--ప్రవీణ్ యాదవ్, ఉపసర్పంచ్ బట్టమేకల శివయాదవ్, వార్డు సభ్యుడు మండల రవి, బట్టమేకల కోమల సాంబయ్య, మాజీ ఎంపీటీసీ దూడే ధనలక్ష్మి--దూడయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు గాదం లసుమయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు కంచు నారాయణ, బండి సాంబరాజు, కడారి పరుశరాములు, గాదం రమేష్, కొండం కుమార్, అన్న చేరాలు, అన్న కొమురయ్య, దూడ మహేందర్, యువ నాయకులు దూడే రాజ్‌కుమార్, బుర్రి శ్రీకాంత్‌తో పాటు గ్రామ



పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు

## – ఎస్ఈ కార్యాలయం, జిల్లా స్టోర్స్ భవన ప్రారంభం
## – విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హనుమకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ నగరంలో మౌలిక వసతులు, విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో కలిసి హనుమకొండ ములుగు రోడ్డులో నూతనంగా నిర్మించిన వరంగల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయ భవనంతో పాటు జిల్లా స్టోర్స్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్ కాంప్లెక్స్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, ఖిలా వరంగల్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే కాకతీయ మెడికల్ కాలేజీ నుంచి పోచమ్మ మైదాన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వరకు, వెంకట్రామ జంక్షన్ నుంచి పోచమ్మ మైదాన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం వరకు ఏర్పాటు చేసిన 33 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్లను ప్రారంభించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా వరంగల్ నగరంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు విస్తరించనున్నాయి.



కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం: శ్రీధర్ బాబు

## – బీసీ బాలికల హాస్టల్‌లో 'ఛాత్రోం కి గూంజ్' కార్యక్రమం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 22:-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం చర్ల పటేల్‌గూడెంలోని బీసీ బాలికల హాస్టల్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో "ఛాత్రోం కి గూంజ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించిన వారు వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను తెలుసుకుని విద్యా వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైందన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం



చేసిన ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత స్వీకరించి రాజీనామా చేయాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థుల శ్రమకు తగిన గౌరవం కల్పించేలా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే సంస్కరణలు చేపట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, ఫ్రూట్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఛాత్రోంకి గూంజ్‌లో శ్రీధర్ బాబు

## – నీట్ అంశంపై విద్యార్థులతో ముఖాముఖి..
## – పారదర్శక పరీక్షల నిర్వహణకు కేంద్రాన్ని కోరిన మంత్రి



ఇబ్రహీంపట్నం, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల కళాశాలలో బుధవారం నిర్వహించిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఎదురైన సమస్యలు, పేపర్ లీకేజీ ప్రభావం, విద్యార్థుల ఆందోళనలపై పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలను మంత్రి సేకరించారు. అనంతరం నీట్ పేపర్ లీకేజీ అంశంపై యువజన కాంగ్రెస్ నాయకులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరాలు అందించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీతో వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ నిర్వహించాలని, జాతీయ పరీక్షల నిర్వహణను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కోరారు. అలాగే విద్యార్థుల ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్, యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు నాగార్జునతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చలో సూర్యాపేట ను విజయవంతం చేయాలి



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి )
మండల పరిధిలోని కుమ్మరి వాడలో రేపు జరగబోయే జిల్లా కమిటీ ఎన్నికకు గ్రామంలో నుండి అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా బాడిని ఎన్నుకొని మన సమస్యలు పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్క కుల బంధువులు చలో సూర్యాపేట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల మల్లయ్య,నరసయ్య, వెంకట నర్సు రామ్మూర్తి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్

## – హనుమకొండలో ఎన్ఎస్‌యూఐ 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం
## – విద్యా వ్యవస్థలో పారదర్శకత, ఉద్యోగాల భర్తీపై కేంద్రాన్ని నిలదీసిన మంత్రి



హనుమకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా ఇందిరానగర్‌లోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం విద్యార్థుల సమస్యలను దేశ దృష్టికి తీసుకెళ్లే వేదికగా నిలుస్తోందని అన్నారు. విద్యా వ్యవస్థలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల్లో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం వంటి అంశాలు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన శాంతియుత నిరసనపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించిన మంత్రి, దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావడంతో పాటు, నియామక ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి సంవత్సరం చట్టబద్ధమైన ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని పేర్కొన్న మంత్రి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యా వ్యవస్థపై యువతలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించాలి

## వరంగల్‌లో రైతు సంఘాల రాస్తారోకో..

## కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని డిమాండ్






వరంగల్, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
అమెరికాతో ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ఉపసంహరించుకోవాలని, రైతుల పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) హామీ కల్పించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో రైతు సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, కుసుంబా బాబురావు, రాచర్ల బాలరాజు, చుక్క మొగిలి, సుదమల్ల భాస్కర్ మాట్లాడుతూ, అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అమలైతే దేశీయ వ్యవసాయం, రైతాంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశీయ రైతుల ప్రయోజనాలను కాపాడే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, విదేశీ దిగుమతుల కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతుల పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు రైతు సంక్షేమానికి అనుకూల విధానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు నర్ర ప్రతాప్, ముక్కెర రామస్వామి, మాలోతు సాగర్, సుంచు జగదీశ్వర్, ఓదెల రాజన్న, మైదం పాణి, అప్పనపురి నర్సయ్య, వినోద్, పూలమ్మతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలబడుతుంది

## - నీట్ పేపర్ లీకేజ్, ప్రతిపక్ష ఎంపీల అరెస్టులను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



హైదరాబాద్ ఎస్టేట్ 22 జూలై 2026
దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. నీట్ పేపర్ లీకేజ్, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి, అలాగే పార్లమెంట్‌లో ఈ అంశంపై చర్చ కోరిన ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ (క్యాతనపల్లి మున్సిపాలిటీ) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ 2014 ఎన్నికల నుండి 2026 వరకు ఎక్కడ ఎన్నికలు జరిగినా అవినీతి రహిత , పారదర్శక పాలన అందిస్తాం, బేటి బచావో- బేటీ పడావో, విద్యా ఉద్యోగాల్లో యువతకు ప్రాధాన్యత కల్పిస్తాం వంటి నినాదాలతో దేశ ప్రజల విశ్వాసాన్ని పొందిందని, కానీ నేడు పరీక్షల విశ్వసనీయతను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కష్టపడి చదివే విద్యార్థులకు న్యాయం జరగని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష ఎంపీలు విద్యార్థుల తరపున నీట్ పేపర్ లీకేజ్ అంశంపై చర్చ జరపాలని మాత్రమే డిమాండ్ చేశారని, అయితే కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పకుండా ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ధోరణితో వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని, దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను వెంటనే నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలబడుతుందని, పరీక్షలలో అవకతవకలు, పేపర్ లీకేజీలు, అవినీతికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నీట్ సహా అన్ని పరీక్షలలో జరిగిన అవకతవకలపై సమగ్ర, పారదర్శక దర్యాప్తు జరపాలని తెల్పారు. పరీక్షా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టి విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలన్నారు. పార్లమెంట్‌లో నీట్ అంశంపై పూర్తి స్థాయి చర్చ నిర్వహించాలిఅని తెపిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, మాజీ జడ్పీటిసి యాకుబ్ అలీ, మాజీ కౌన్సిలర్ పనాస రాజు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్ రెడ్డి, అధికార ప్రతినిధి మొట్టె సుధాకర్, మాజీ ఎంపీటీసీ పుల్లూరి కళ్యాణ్, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, మేకల సురేందర్, ఏల్పుల సత్యనారాయణ, ఎర్రబెల్లి రాజేష్, కార్యదర్శులు పైడాకుల శ్రీనివాస్, నర్రా శ్రీనివాస్, రాపాక రాజు, శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు వనం యాదగిరి పోగుల లచ్చులు, కనకయ్య, పందిరి లింగయ్య, మహిళా నాయకులు రాజేశ్వరి, పుష్ప, దీప, అనూష, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్

## హనుమకొండలో ఎన్‌ఎస్‌యూఐ 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం

## విద్యా వ్యవస్థలో పారదర్శకత, ఉద్యోగాల భర్తీపై కేంద్రాన్ని నిలదీసిన మంత్రి



హనుమకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా ఇందిరానగర్‌లోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం విద్యార్థుల సమస్యలను దేశ దృష్టికి తీసుకెళ్లే వేదికగా నిలుస్తోందని అన్నారు. విద్యా వ్యవస్థలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో లోపాలు, నియామకాల్లో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం వంటి అంశాలు యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన శాంతియుత నిరసనపై పోలీసులు బలప్రయోగం చేశారని ఆరోపించిన మంత్రి, దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావడంతో పాటు, నియామక ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి సంవత్సరం చట్టబద్ధమైన ఉద్యోగ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని పేర్కొన్న మంత్రి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విద్యా వ్యవస్థపై యువతలో విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# వరంగల్ పశ్చిమకు భట్టి వరం..

## రెండు 132/33 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు..

### - ఎమ్మెల్యే నాయిని విజ్ఞప్తికి వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం..

### - బాలసముద్రం, కేయూ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్లు..

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
హనుమకొండ, జూలై 22: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలోని బాలసముద్రం మరియు కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) వద్ద రెండు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు.కొత్తగా ఏర్పాటు కానున్న ఈ రెండు సబ్‌స్టేషన్లతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ గణనీయంగా బలోపేతం కానుంది. లోడ్ సామర్థ్యం పెరగడంతో పాటు, పెరుగుతున్న గృహ, వాణిజ్య, విద్యా సంస్థలు, పరిశ్రమల విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చే అవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తులో కనీసం 10 నుంచి 15 సంవత్సరాల వరకు విద్యుత్ లోడ్ సమస్యలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, సరఫరా అంతరాయాలు వంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ఈ సబ్‌స్టేషన్లు దోహదపడతాయని అధికారులు తెలిపారు.తెలంగాణ ఎన్జీఓఎస్ (TNGOS) సంఘం ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డుల మంజూరుపై రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆరోగ్య భద్రత కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు మెరుగైన వైద్య సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని కొనియాడారు.ఈ సందర్భంగా



టీఎన్‌జీఓఎస్ కమిటీ సభ్యులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, టీఎన్‌జీఓఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై 27న "ఛలో పార్లమెంట్"

## జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్




హైదరాబాద్,జూలై 22: కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ హైదర్ గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్(ఎన్ ఎస్ ఎస్) లో జరిగిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్దత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదని,అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్దత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు,
జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం
పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.మీడియా సమావేశంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారవు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కో-కన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# బీసీలపై పెరుగుతున్న అవమానాలు, అక్కృత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలి

## జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్

హైదరాబాద్, జూలై 22: దేశంలో బీసీ సమాజంపై రోజురోజుకు పెరుగుతున్న అవమానాలు, కులదూషణలు, సామాజిక వివక్ష, హింసాత్మక ఘటనలను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే 'బీసీ రక్షణ చట్టం' తీసుకురావాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... బీసీలపై కులదూషణలను శిక్షార్హ నేరంగా గుర్తించి కఠిన శిక్షలు అమలు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక బీసీ రక్షణ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ మహిళలపై జరిగే అవమానాలు, దాడులపై వేగవంతమైన విచారణ కోసం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్నీరు. కులగణన ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తెలంగాణలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లు, బీసీ సంక్షేమ పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల నుంచి శాసనసభ, పార్లమెంట్ వరకు బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. తాము చేపట్టే బీసీ ఉద్యమం ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు, సామాజిక న్యాయం, బీసీల ఆత్మగౌరవ పరిరక్షణ కోసమే అని ఆయన పేర్కొన్నారు. బీసీ సమాజంపై జరిగే ప్రతి అవమానాన్ని చట్టబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని, హక్కుల సాధనకోసం



బీసీలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని రాజేందర్ పటేల్ గౌడ్ పిలుపునిచ్చారు.

# ఈనెల 25న జరిగే ఏకలవ్యుని జయంతిని విజయవంతం చేయండి.

## బి.శ్రీను నాయక్

చిలకలూరిపేట/ మహాభారతంలో ఏకలవ్యుని పాత్ర చాలా ఘనమైనది అటువంటి మహనీయుని స్మరించుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కావూరు గ్రామంలో ఉన్నటువంటి ఏకలవ్య కాలనీలో గిరిజన సీనియర్ నాయకులు కుంభ నాగేశ్వరరావు



చేతుల మీదగా కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకలవ్యుడు విలువిద్యలో ప్రావీణ్యం సంపాదించడమే కాకుండా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. అలాంటి వ్యక్తి ఆశయాల అనుగుణంగా ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉందన్నారు. ఈనెల 25వ తేదీన పట్టణంలోని రైతు బజారు ఎదురుగా ఉన్నటువంటి ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైనటువంటి నివాళులర్పించడం జరుగుతుంది. తదుపరి కావూరు గ్రామంలో ఉన్నటువంటి ఏకలవ్య కాలనీలో ఉన్న విగ్రహానికి నివాళులర్పించి, మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిరిజన సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మోట రాముడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గిరిజన సంఘీలు, నాయకులు, విద్యార్థులు,యువకులు ఉపాధ్యాయులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, కుంభ శివయ్య, కుంభ నాగేశ్వరరావు, కుంభ శ్రీనివాసరావు, వల్లపు రత్తయ్య, కుంభ రవి, కుంభ అనిల్ కుమార్, కుంభ సాంబయ్య, మేడ రోశయ్య, కుంభ అంజమ్మ, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఛాత్రోంకి గూంజ్‌లో శ్రీధర్ బాబు

## - నీట్ అంశంపై విద్యార్థులతో ముఖాముఖి..
## - పారదర్శక పరీక్షల నిర్వహణకు కేంద్రాన్ని కోరిన మంత్రి

ఇబ్రహీంపట్నం, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్: తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో బుధవారం నిర్వహించిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఎదురైన సమస్యలు, పేపర్ లీకేజీ ప్రభావం, విద్యార్థుల ఆందోళనలపై పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలను మంత్రి సేకరించారు. అనంతరం నీట్ పేపర్ లీకేజీ అంశంపై యువజన కాంగ్రెస్ నాయకులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరాలు అందించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో






మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీతో వేలాది మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ నిర్వహించాలని, జాతీయ పరీక్షల నిర్వహణను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కోరారు. అలాగే విద్యార్థుల ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సికిందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్, యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు నాగార్జునతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగంలో మౌలిక వసతుల విస్తరణకు శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

పలు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఖ= నాగరాజు గారు...
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండలో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు బుధవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గారు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.అనంతరం ములుగు రోడ్డులోని నూతనంగా నిర్మించిన స్పోర్ట్స్ భవనం, నార్తన్ పవర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ భవానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని,మొక్కను నాటారు.అనంతరం వరంగల్ లోని కలెక్టరేట్ కాంప్లెక్స్ కేవీ విద్యుత్ ఉపకేంద్రం,కేఎంసీ విద్యుత్ ఉపకేంద్రం,పోచమ్మ మైదాన్ విద్యుత్ ఉపకేంద్రం,ఇంటర్ లింకింగ్ లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిరుద్యోగుల కోసం ఉచిత కోచింగ్ యాప్

## కేటీఆర్ జన్మదినాన ఆవిష్కరణ.. 50 కిలోల కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నేతలు

హనుమకొండ, జులై 22 హైదరాబాద్ ఎస్టేట్: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండలో దివ్యాంగుల సహకార సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం రూపొందించిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ యాప్‌ను బుధవారం ఆవిష్కరించారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేష్, మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, నాగూర్ల వెంకన్న, మర్రి యాదవరెడ్డి, జాతీయ మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఈ ఆన్‌లైన్ కోచింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయాలు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్






మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉద్యోగాలు, పరిశ్రమల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలను విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, ఆరూరి రమేష్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ కూడా తమ ప్రసంగాల్లో నిరుద్యోగం, విద్యా వ్యవస్థ, వ్యవసాయం తదితర అంశాలపై పార్టీ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని అతిథులు 50 కిలోల కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్ రాజకీయ, ఉద్యమ ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక ఆడియో--విజువల్ ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిరుద్యోగ యువత, బీఆర్ఎస్వీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, విద్యార్థి ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 22 నీట్ పేపర్ లీక్ పై అక్రమంగా అరెస్టు చేసిన రాహుల్ గాంధీ గారిని విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండిస్తూ కందుకూర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సౌడపు





వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిసిసి రాష్ట్ర కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి. మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి. మార్కెట్ యార్డ్ చైర్మన్ కృష్ణ నాయక్. మండల అధ్యక్షులు రాణా ప్రతాప్ రెడ్డి. కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు మాజీ పిఎస్సిఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి. బీసీ సెల్ మండల అధ్యక్షులు సరికొండ జగన్ మాజీ ఉప సర్పంచ్ గుండా సుధాకర్ రెడ్డి వార్డు సభ్యులు సౌడపు శేఖర్ గౌడ్ సిరిగిరి కవిత జంగాచారి వరికుపల బాబు. ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షులు గాదె కుమార్ సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి. అఫ్జల్ బేగు. రామ్ రెడ్డి. సరికొండ జగన్ ఎగిడి కృష్ణ పాండురంగారెడ్డి. పెరుమల శేఖర్. మహేందర్. పాముల శ్రీశైలం. విజయ్. రాజశేఖర్ రెడ్డి. గాండ్ల నవీన్. ఫయాజ్. ఎగిడి జగదీష్ ప్రశాంత్ సల్మాన్ అనిల్ ఎన్ఎస్ఈఐ మండల అధ్యక్షులు ప్రభు తదితరులు పాల్గొన్నారు

# రైల్వే ప్రయాణం మరింత సురక్షితం..

## భారీగా తగ్గిన ప్రమాదాలు

భారతీయ రైల్వేలో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ఇటీవలి కాలంలో కేటాయింపులను మూడింతలు పెంచడంతో పాటు ఆధునిక రక్షణ చర్యలు చేపట్టడం వల్లే ఇది సాధ్యమైందని రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో ఒకటైన భారతీయ రైల్వేలో ఇదొక సానుకూల పరిణామంగా



నిలుస్తోంది.పెరిగిన బడ్జెట్‌తో ట్రాక్‌ల నిర్వహణ, సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణ, సిబ్బందికి మెరుగైన శిక్షణ వంటి కీలక పనులను చేపట్టారు. అధునాతన భద్రతా ప్రోటోకాల్స్‌ను అమలు చేయడం కూడా ప్రమాదాల తగ్గుదలకు దోహదపడింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి చర్యలు సురక్షితమైన రైల్వే కార్యకలాపాలకు ప్రధాన కారణమయ్యాయని అధికారులు పేర్కొన్నారు.
ప్రమాద రహిత వ్యవస్థను ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని, ఇందుకోసం నిరంతర పర్యవేక్షణ, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించామని రైల్వే అధికారులు వివరించారు. ఈ పురోగతి ప్రయాణికుల్లో విశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, రైల్వే సేవలను మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ- పార్లమెంట్‌తేది:22-07-2026
జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై పార్లమెంట్ ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో జాతీయ ఆహార భద్రత చట్టం (చీఖీూా) అమలుపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్లో ప్రశ్నించారు. జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారో, అలాగే ఆహార ధాన్యాల కేటాయింపు మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ఎంపీ డా.కడియం కావ్య వివరాలు కోరారు.ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి శ్రీమతి నిముబెన్ జయంతీభాయ్ బంభానియా లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 4,51,376 మంది లబ్ధిదారులు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఉచిత ఆహార ధాన్యాలు పొందుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు గుర్తించిన లబ్ధిదారుల ఆధారంగా కేంద్రం నిర్దేశించిన పరిమితుల మేరకు ఆహార ధాన్యాల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద ప్రతి కుటుంబానికి నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలు, ప్రాధాన్య కుటుంబాల (పీహెచ్‌హెచ్) కింద ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలు అందిస్తున్నట్లు వివరించారు.ప్రజల సంక్షేమం, పేద కుటుంబాల ఆహార భద్రత అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందాలనేదే తన లక్ష్యం అన్నారు. ఆహార ధాన్యాల కేటాయింపులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగితే తగిన విధంగా కేటాయింపులు పెంచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు.

RNI No Tel / 2012 /4241
# హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## ఢిల్లీ ఘటనపై సుమోటో విచారణ జరపాలి: సీపీఐ




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 22:-
ఢిల్లీలో ఇటీవల జరిగిన "చలో పార్లమెంట్" నిరసన సందర్భంగా విద్యార్థులు, మహిళలు, నిరసనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల సీపీఐ ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, మహిళలపై లాఠీచార్జ్ జరగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. ఈ ఘటనలో పోలీసులతో పాటు గుర్తుతెలియని వ్యక్తులు కూడా పాల్గొన్నట్లు ఆరోపిస్తూ, వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యావేత్త సోనం ఉంచిన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుగానే పరిష్కరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. అలాగే నీట్ పేపర్ లీకేజీ ఘటన, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించి, సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా, మండల నాయకులు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రక్షణ చట్టం అత్యవసరం..

### – చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు..


### – టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్ పొట్లపల్లి...



హైదరాబాద్ :జూలై 22..
ఉద్యమాలు, ఆందోళనలు ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులేనని, విధి నిర్వహణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని, గర్హనీయమని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్ పొట్లపల్లి అన్నారు..బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధుల పై రాళ్లతో దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య అనుసంధానం చేస్తూ,నిలుస్తూ, అన్ని రాజకీయ పార్టీల కార్యకలాపాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులపై తరచూ దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.విధి నిర్వహణలో ఉన్న విలేకరుల భద్రతకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో హామీ ఇవ్వాలని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో జర్నలిస్టులపై దాడులు పునరావృతమైతే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని అశోక్ గౌడ్ పొట్లపల్లి హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి రాజకీయ పార్టీతో పాటు ప్రతి పౌరుడి గురుతర బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.ఈ విషయాలపై టి డబ్ల్యూ జె ఎఫ్ ఈ నెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నదని జర్నలిస్టులంతా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు..

## విధి నిర్వహణలో ఉన్న పోలీసులను కొట్టడం దారుణం .

### – లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు దశరథ నాయక్



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జబీా వాళ్లు విధి నిర్వాహణలో ఉన్న పోలీసు సిబ్బందిని కొట్టడం, విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తించి, వాళ్ళ శరీరాల్ని తాకడానికి లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది, ఖండిస్తుంది.
పరిస్థితులు అదుపు తప్పినప్పుడు శాంతి భద్రతలు కాపాడడానికి పై అధికారుల ఆదేశాల ప్రకారం పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తారు, బాష్పవాయువు ప్రయోగిస్తారు. అది వాళ్ళ విధి. డ్యూటీలో ఉన్న పోలీసులపై చేయి చేసుకోవడం, కొట్టడం ఆందోళనకారులు, రాజకీయ నాయకులకు ఈ మధ్య అలవాటైపోయింది. ఇట్టి విషయాల్ని న్యాయస్థానాలు సుమోటోగా తీసుకొని పోలీసు వారిపై, ప్రభుత్వ ఉద్యోగులపై, విధి-నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై అనుచితంగా ప్రవర్తిస్తే, కొడితే, తిడితే వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేయాలని ఈ పార్టీ తరపున లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున డిమాండ్ చేస్తున్నాం!
ఇట్లు
వీ. దశరథ్ నాయక్
స్టేట్ ప్రెసిడెంట్
లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా
తెలంగాణ రాష్ట్రం.

## NEET పేపర్ లీక్‌పై పార్లమెంట్ ముందు విపక్షాల ఆందోళన

### – విద్యార్థులపై పోలీసుల దాడి నిరసిస్తూ వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరసన

### – ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

న్యూఢిల్లీ తేది: 22-07-2026
చీజుజు పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు.ఈ సందర్భంగా నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని పేర్కొన్నారు.
NEET పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.




## విద్యార్థులపై లాఠీచార్జిని నిరసిస్తూ మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 22:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు మల్లేష్ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భావిభారత ప్రధాని శ్రీ రాహుల్ గాంధీ ని అరెస్టు చేసిన పోలీసులు మరియు విద్యార్థుల లటి చార్జి చేసిన కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేసి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ తరపున నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్,కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మహేశ్వరం మాజీ ఎంపీటీసీ సభ్యులు కున యాదయ్య,మాజీ అధ్యక్షులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సర్పంచ్ అధ్యక్షుడు ఉప్పుగడ్డ గ్రామ సర్పంచ్ రాజు నాయక్, కోళ్ల పడకల్ గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్, పెండ్యాల గ్రామ ఉపసర్పంచ్ మంత్రి అంజయ్య, రామచంద్రగూడ గ్రామ ఉపసర్పంచ్ భాస్కర్ నాయక్, తుమ్మలూరు గ్రామ ఉపసర్పంచ్



సంగారెడ్డి,శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్, అల్లే బిక్షపతి, శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్లు పోతర్ల తిరుపతయ్య యాదవ్, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ దోమ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇమ్మడి ప్రవీణ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగల్ల లాజర్, మన్సాన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఏర్పుల శ్రీశైలం, కల్వకోల్ కంటెస్టెంట్ సర్పంచ్ తిరుమల సుధాకర్, దిల్వార్ గూడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సభావాత్ రవీందర్ నాయక్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, మహేశ్వరం గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు స్వర్ణగంటి ఆకాష్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంత్రి బాలరాజ్, లోకేష్ రెడ్డి, ఏర్పుల గణేష్, మహేశ్వరం గ్రామ 10వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్, 14వ వార్డు ఇంచార్జ్ పుట్లగారి చందు, తదితరులు పాల్గొన్నారు

## బిఎల్ఏ లు ప్రతీ ఇంటికీ వెళ్లాలి: కేఎల్ఆర్

### - 542 మంది టీమ్.. క్షేత్రస్థాయిలో పని చేయాలి కెఎల్ఆర్

### - సర్ - ఎన్యూమరేషన్ ఫామ్స్ ను ఓటర్లకు అందించాలి

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణా చారిజులై 22:)
ఆగస్టు 3 వరకు పార్టీ, బిఎల్ఓ లతో కో-ఆర్డినేట్ చేసుకోవాలి.ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ (సర్ ) కార్యక్రమంలో కాంగ్రెస్ బిఎల్ఏ లు ఆగస్టు 3 వరకు పూర్తి స్థాయిలో పని చేయాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.
542 బూత్ ల్లో పని చేస్తున్న బిఎల్ఏలు, వారి టీమ్ ఒక్కొక్కరికీ 5 మంది, 92 మంది బూత్ ఇన్ఛార్జులు, 17 మంది డివిజన్ అధ్యక్షులు, 17 మంది అబ్జర్వర్లు, 4 కో- ఆర్డినేటర్స్...నియోజకవర్గంలో సమన్వయం చేసుకుని కాంగ్రెస్ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలని కెఎల్ఆర్ కోరారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రావాలంటే తప్పకుండా ఓటుహక్కు కోల్పోకుండా ఉండాలని... నిజమైన ఓట్లు గల్లంతు కాకుండా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు.
మహేశ్వరం నియోజకవర్గంలో 100శాతం సర్ పూర్తి చేసేలా బిఎల్ఏలు... ప్రభుత్వాధికారులు బిఎల్ఓ లకు సహకరించాలని కిచ్చెన్న కోరారు.
బీజేపీ కుట్రలను బద్దలు కొట్టాలి: లక్ష్మారెడ్డి
సర్ ను అడ్డం పెట్టుకుని మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని కిచ్చెన్న ఆరోపించారు.
ఒకరికి ఒక ఓటు- సొంత ఊర్లోనా.. పట్నంలోనా అనేది తేల్చుకోవాలని కెఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. చనిపోయినా వారి ఓట్లు, గత ప్రభుత్వంలో చేసిన దొంగ ఓట్లను తొలగించేలా పూర్తిస్థాయిలో అవగాహనతో పని చేయాలని లక్ష్మారెడ్డి సూచించారు. బిఎల్ఏ లు ప్రతీ ఇంటింటికీ వెళ్లి




అందరి ఇంటి పెద్ద, కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు సేకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అబ్జర్వర్లు, ఇన్ఛార్జులు, బూత్ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పని చేసి రాహూల్ గాంధీ గారితో ఫోటోలు దిగాలని సర్ టీమ్ కు కెఎల్ఆర్ చెప్పారు.

## విద్యార్థుల ముసుగులో అల్లరి మూకలు చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు

### – ఢిల్లీలో నిరసన పేరుతో హింసాత్మక ఘటనలు దుర్మార్గపు చర్య

### – విద్యార్థుల ముసుగులో అల్లరి మూకల దుశ్చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు

### – బిజెపి కందుకూరు మండలం అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 22
దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల పేరుతో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలు అత్యంత హేయమైన చర్య అని బిజెపి కందుకూరు మండల అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది అని అయితే ఆ హక్కును అడ్డుపెట్టుకుని ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం, పోలీసులపై దాడులకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం ఏమాత్రం సమర్థనీయం కాదని అన్నారు. విద్యార్థుల ముసుగులో కొందరు అల్లరి మూకలు హింసకు పాల్పడుతూ ప్రజాస్వామ్య విలువలను అవమానించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని సమస్యలపై చర్చించాల్సిన యువతను రాజకీయ ప్రయోజనాల కోసం రెచ్చగొట్టి, హింసాత్మక ఘటనలకు ప్రేరేపించడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయవచ్చు, నిరసనలు తెలియజేయవచ్చు. కానీ నిరసన పేరుతో హింసకు పాల్పడటం, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం మాత్రం ప్రజాస్వామ్య హక్కు కాదని ఇలాంటి ఘటనలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు. దేశ రాజధానిలో శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రతి పౌరుడు చట్టాన్ని



గౌరవిస్తూ శాంతియుత మార్గాల్లో తన నిరసనను వ్యక్తం చేయాలి. హింసను ప్రోత్సహించే శక్తులను ప్రజలు గుర్తించి తిరస్కరించాలన్నారు. దేశంలో శాంతి, భద్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. హింసకు తావులేని, చర్చలు మరియు రాజ్యాంగబద్ధమైన మార్గాలే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.

# పేపర్ లీకులకు బీజేపీ ప్రభుత్వం కేరాఫ్ అడ్రస్..

## – విద్యార్థుల భవిష్యత్తుతో మోడీ ప్రభుత్వం చెలగాటం..

## – నీట్ పరీక్షల లీకేజీ, రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్ట్‌పై భగ్గుమన్న నిరసనలు.

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి అశోక్

ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం..

విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని మూడు నెలల కిందట నీట్ పరీక్ష లీక్ కావడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వరుస పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న తీరును నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు హోరెత్తాయి. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం ముట్టడికి యత్నించిన కాంగ్రెస్ అగ్రనేత,లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ..ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు గారి ఆధ్వర్యంలో బుధవారం కమాన్ చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,స్థానిక నాయకులు,యువజన సంఘాల కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి మరియు ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసనను గట్టిగా చాటారు.ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ ఆందోళన సమాచారం అందుకున్న ఏసీపీ గజ్జి కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్,ఎస్సై నరేష్ తదితర పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుని పక్కకు తొలగించారు. ఆందోళనకారులను నిలువరించి ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు గారు మీడియాతో మాట్లాడుతూ..దేశంలో గడచిన 12 ఏళ్ల పాలనలో ఏకంగా 12 సార్లు ప్రశ్నపత్రాలు లీకయ్యాయని, నిరుద్యోగ యువత, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టేస్తోందని ధ్వజమెత్తారు. మొన్నటికి మొన్న నీట్ పరీక్ష లీకేజీ కారణంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డారని, మానసిక వేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయిన ప్రతి విద్యార్థి కుటుంబానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే తమ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, పదేళ్లలో కోట్లాది మంది యువతను మోసగించిందని విమర్శించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తూ వారిని



అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం,అక్రమ అరెస్టులకు పాల్పడడం మోడీ ప్రభుత్వ అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేని యెడల రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు నూగిల్ల మల్లన్న, బిరుదు రాధాకృష్ణ , వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు మినుపాల ప్రకాష్ రావు, కూర



మల్లా రెడ్డి, రామిడి తిరుపతి రెడ్డి, కొమ్ము పోచాలు, సింగిల్ విండో చైర్మన్లు సామ రాజేశ్వర్ రెడ్డి, చిలుక సతీష్, ముత్యాల నరేష్, కళ్లేపల్లి జానీ, మండల పార్టీ అధ్యక్షులు గాజవేన సదయ్య, భూషణవేణ సురేష్ గౌడ్, బూతగడ్డ సంపత్, వేగోలం అబ్బయ్య గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్, సారయ్య గౌడ్, సయ్యద్ మస్రత్, ఆరే సంతోష్, దాన్నాయక దామోదర్ రావు, ఆడేపూ వెంకటేష్ , ఆర్కుట్ సంతోష్, ప్రదీప్, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,యువజన సంఘాల కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## ఐదేళ్లలో మూడుసార్లు పేపర్ లీక్ అయింది

### : బీజేపీపై అన్నామలై ఆగ్రహం



నీట్ ప్రవేశ పరీక్షకు తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ, ఇన్నాళ్లూ ఆ విధానానికి అండగా నిలిచిన బీజేపీ మాజీ నేత కె. అన్నామలై ఇప్పుడు ఈ విషయంలో జవాబుదారీతనం కోరుతున్నారు. పదేపదే ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకోవడంతో విద్యార్థులు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారని, ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లు రావడం సహజమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పంచుకున్నారు.గతంలో తాను నీట్ పరీక్షకు ఎందుకు మద్దతు పలికారో అన్నామలై ఈ సందర్భంగా వివరించారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థుల ఎంపికలో ఏకరూపత ఉంటుందని, తద్వారా పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులు కూడా వైద్యులు కావాలనే తమ కలను నెరవేర్చుకునేందుకు సమాన అవకాశాలు లభిస్తాయని తాను విశ్వసించినట్లు పేర్కొన్నారు."గత ఐదేళ్ల కాలంలో నీట్ యూజీ ప్రశ్నపత్రం మూడుసార్లు లీక్ అయింది. దీనివల్ల విద్యార్థులు ఎంతటి తీవ్ర ఒత్తిడికి లోనవుతారో ఊహించండి. వ్యవస్థలో ఏకరూపత తీసుకురావాల్సిన యంత్రాంగమే విఫలమవుతున్నప్పుడు, అక్కడ జవాబుదారీతనం శూన్యమైంది. ఈ వైఫల్యమే విద్యార్థులను ఆందోళనల బాట పట్టేలా చేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని అన్నామలై స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రాథమిక హక్కు అని గుర్తుచేసిన ఆయన, విద్యార్థులతో చర్చలు జరపడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇంత జాప్యం చేసిందని ప్రశ్నించారు. "నిరసనలు ఉధృతమయ్యే వరకు ఎందుకు వేచి చూశారు? మిమ్మల్ని అడ్డుకున్న శక్తులు ఏవి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అదే సమయంలో, స్వార్థ ప్రయోజనాలు ఆశించే శక్తులు తమ ఉద్యమాన్ని పక్కదారి పట్టించకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందని ఆయన సూచించారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థులతో చర్చలు జరిపి, పారదర్శకతతో వారి ఆందోళనలను నివృత్తి చేసేందుకు వేగవంతమైన చర్యలు చేపట్టాలని అన్నామలై కోరారు. "మన వ్యవస్థలపై యువతకు నమ్మకం సడలితే, అది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరం" అని ఆయన హెచ్చరించారు.

# వారు శ్రీకాకుళం పరువు తీశారు

## : మంత్రి అచ్చెన్నాయుడు

### – తమ్మినేని భూ భాగోతాలపై విచారణ జరపాలని ఆదేశించామన్న అచ్చెన్నాయుడు

### – బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం దారుణమని వ్యాఖ్య

### – పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడి

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అక్రమాలు ఇంకా చాలా ఉన్నాయని, వాటన్నిటిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ నేతల అరాచకాల వల్ల జిల్లా ప్రతిష్ట మసకబారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా నుంచి మంత్రిగా, సభాపతిగా కీలక బాధ్యతలు నిర్వహించిన వారు చేసిన దారుణాలు చూసి నివ్వెరపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లుగా చిత్రీకరించి భూములు కాజేయడం సిగ్గుచేటని, అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే తాను ఆత్మహత్య చేసుకునేవాడినని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ స్పీకర్‌గా విలువలతో కూడిన ఉపన్యాసాలు ఇచ్చి, తెరవెనుక ఇలాంటి అక్రమాలకు ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి, వారిని సమర్థించే వారికి నైతికత లేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు అలాగే తయారైందని విమర్శించారు.

గతంలో తనపై పెట్టినవన్నీ తప్పుడు కేసులు కాబట్టే తాను ధైర్యంగా ఉన్నానని, అక్రమాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ఆగమేఘాల మీద అరెస్టులు చేసే సంస్కృతి తమ ప్రభుత్వానిది కాదని తేల్చి చెప్పారు.

రైతుల సమస్యలపై జగన్ నాటకాలు

గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని జగన్మోహన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోళ్లలో తలెత్తిన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారని, ఢిల్లీలో జరిపిన చర్చలు సఫలమయ్యాయని వివరించారు. ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు విషయంలోనూ కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సానుకూల పరిణామాలను జీర్ణించుకోలేక, జగన్ తన పార్టీ కార్యకర్తలకు రైతు కండువాలు కప్పి కొత్త నాటకాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు.

పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి



త్వరలోనే పరిష్కారం

రాష్ట్రం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన చేసిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పొగాకు రైతులతో జగన్ జరిపిన సమావేశం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్ర మంత్రులు పొగాకు కొనుగోళ్లు, ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు.







